

కంట్రోల్ రూమ్ పరిశీలన


కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మొంథా తుపాను కంట్రోల్ రూమును కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన కాల్స్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, డివిజన్, మండలాల్లోని కంట్రోల్ రూమ్ నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను, భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాలకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ ద్వారా సేకరించి సంబంధిత శాఖల అధికారులకు తెలియజేయాలన్నారు.

అన్నదాత ఆక్రందన..!

మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు

వరిరైతుకు కోలుకోలేని దెబ్బ

పశ్చిమలో 26 వేల ఎకరాల్లో వరి పంటకు ముప్పు

ఏలూరు జిల్లాలో 7,920 ఎకరాల్లో వరి, ఇతర పంటలకు దెబ్బ

గింజ గట్టిపడే, ఈనిక దశలో నేలకొరగడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం

82 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

తీరప్రాంతంలో 1200 ఎకరాల్లో ఆక్వా చెరువులకు గండి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొంథా తుపాను అన్నదాతను నిలువునా ముంచేసింది. తుపాన్ తీరం దాటేముందు వీచిన ఈదురుగాలులు, వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. చివరిదశకు చేరిన పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో ముఖ్యంగా వరిరైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంట నష్టానికి సంబంధించి అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వనున్నారు. తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, వర్షాలకు రెండు జిల్లాల్లో పక్వానికి వచ్చిన పంటంతా నేలనంటి నీటిలో నానుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. తుపాన్ దెబ్బకు పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 27,500 ఎకరాల్లో వరిపంటకు ముప్పు వాటిల్లింది. దీనిలో 10,521 ఎకరాల్లో పంట ముంపునకు గురవ్వగా, 17,040 ఎకరాల్లో పంట నేలనంటింది. ఏలూరు జిల్లాలో వరి 6,075 ఎకరాల్లో ముంపునకు గురవ్వగా, మినుము 881 ఎకరాలు, వేరుశెనగ 67 ఎకరాలు, పత్తి పంట 897 ఎకరాల్లో దెబ్బతింది. ఉద్యాన పంటలు అరటి, కూరగాయలు, కొబ్బరికి సంబంధించి 82 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వరిసాగులో పంటనష్టం తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈనిక, గింజ గట్టిపడే దశలో పొలాలు నేలనంటి నీటిలో నానుతున్న పరిస్థితి ఉంది. ఎకరాకు పది నుంచి ఎనిమిది బస్తాల దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. నీరు తగ్గకపోతే పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు తక్కువగా లెక్కించినా రూ.20 వేలకుపైగా నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 2,500 ఎకరాల్లో పంట నేలనంటడం, ముంపుబారిన పడిన పరిస్థితి ఉంది. డెల్టాలోనూ అనేక మండలాల్లో పెద్దఎత్తున పంట ముంపు బారిన పడింది. వరి రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంటంతా చివరిదశకు చేరింది. మరో 15 రోజుల్లో పంట


ఆచంటలో నేలకొరిగిన వరిచేను

చేతికొచ్చే సమయంలో మొంథా తుపాను దెబ్బకు రైతుల ఆశలన్నీ నీరుగారిపోయాయి. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. నేలనంటిన వరిచేలు మాసూలు చేయడానికి ఎకరాకు రూ.పది వేల వరకూ ఖర్చవుతుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నరసాపురం తీర ప్రాంతంలో నల్లిక్రీక్ ఉప్పొంగి గండిపడటంతో 1200 ఎకరాల ఉప్పునీటి రొయ్యల చెరువులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. తుపానుకు సంబంధించి తీసుకున్న చర్యలతో రెండు జిల్లాల్లోనూ ప్రాణం నష్టం చోటుచేసుకోలేదు.

పంటనష్టం ప్రాథమిక వివరాలు ఏలూరు జిల్లాలో	
పంట	ఎకరాలు
వరి	6,075
మినుము	881.2
వేరుశెనగ	67
పత్తి	897.2
నష్టపోయిన రైతులు: 9,567 మంది	
తుపాన్ ప్రభావం పడిన గ్రామాలు: 281	

పశ్చిమలో దెబ్బతిన్న పంట ప్రాథమిక వివరాలు (ఎకరాల్లో)	
ముంపునకు గురైన వరి పంట:	10,521
నేలనంటిన పంట:	17,040
ఆక్వా చెరువులు:	1200

కూలిన చెట్లు..

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..

తుపాన్ ప్రభావంతో వీచిన గాలులకు రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 174 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖాధికారులు వెంటనే చర్యలు ప్రారంభించి పునరుద్ధరించే పని చేపట్టారు. 93 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. 662 చెట్లు కూలడంతో అధికారులు తొలగించారు. ఏలూరు జిల్లాలో విద్యుత్ స్తంభాలు 183, ట్రాన్స్‌ఫార్మర్లు 22 వరకూ దెబ్బతిన్నాయి. కలిదిండి వంటి ప్రాంతాల్లో ఆర్అండ్‌బి రోడ్లు దెబ్బతినడంతో రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది. తుపాన్ ప్రభావం జిల్లాపై తక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆగిన వర్షం.. కొనసాగిన గాలులు

ప్రజాశక్తి - నరసాపురం

మొంథా తుపాన్ తీరం దాటినా తీరప్రాంత ప్రజల్లో ఆ భయం వీడలేదు. మంగళవారం నుండి బుధవారం మధ్యాహ్నం వరకూ బలమైన ఈదురు గాలులు వీస్తూనే ఉన్నాయి. తీర గ్రామాల్లో ఈ గాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. ఇటు సముద్రపు హోరు, కెరటాల ఉధృతి తగ్గలేదు. పలు ప్రాంతాల్లో సముద్ర అలలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున పిఎం లంక గ్రామంలో సముద్రం సుమారు వంద మీటర్ల మేర ముందుకు చొచ్చుకొచ్చింది. వర్షాలకు కూరగాయల తోటల్లోకి నీరు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. పలు గ్రామాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. మధ్యాహ్నానికి సముద్రం శాంతించి కెరటాలు తగ్గినా హోరు మాత్రం తగ్గలేదు. గాలులు ఇంకా బలంగానే వీస్తూనే ఉన్నాయి. చెట్ల కొమ్మలు పడి పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ మంత్రి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్నా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షం ఆగినా గాలుల ఉధృతి కొనసాగడంతో జనం పెద్దగా బయట తిరగలేదు. నరసాపురంలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మూసివేశారు. దీంతో ఆయా కేంద్రాల్లోని ప్రజలు ఇళ్లకు వెళ్లిపోయారు.


తీరంలో వీస్తున్న గాలులు

నల్లిక్రీక్ వంతెనకు గండి

అవతల చిక్కుకున్న ఆరుగురు రైతులు : రక్షించిన సహాయక బృందాలు

నరసాపురం మండలం వేములదీవి వెస్ట్‌లోని చినమైనవానిలంక గ్రామంలో నల్లిక్రీక్ వంతెనకు బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు గండి పడింది. వంతెనకు అటువైపు ఆక్వా చెరువుల వద్దకు వెళ్లిన గ్రామస్తులు ఆరుగురు చిక్కుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను తీసుకెళ్లి చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

తీరంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన


పునరావాస కేంద్రంలో చిన్నారికి భోజనం తినిపిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - నరసాపురం

మొంథా తుపాన్ కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఆక్వా రైతులను, తుపాన్ బాధితులను పరామర్శించారు. చినమైనవానిలంక వద్ద నల్లిక్రీక్ ఉప్పొంగి రోడ్డు కోతకుగురై గండిపడిన ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు పూర్తిగా నీటమునిగి దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. వేములదేవి ఈస్ట్ వెస్ట్ కుక్కిలేరు వద్ద గట్టు పైనుండి నీరు పొంగడంతో నీట మునిగిన కరుణానగర్ కాలనీని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. జిల్లా యంత్రాంగం పునరావాస కేంద్రానికి రావాలని చెప్పినా ఎందుకు రాలేదని అక్కడి వారిని ప్రశ్నించారు. ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటని కాలనీ వాసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తుపాన్ తీరం దాటినట్లు ప్రకటించిన బియ్యపుతిప్ప గ్రామం ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. తుపాన్‌కు నష్టపోయిన ప్రతిఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవ్వరూ ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు.

కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం సందర్శించారు. తొలుత ఆమె డిజిటల్ భవన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఆశ్రయం పొందిన వారిని ఆప్యాయంగా పలుకరించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో అన్ని ఏర్పాట్లు బాగున్నాయా, భోజనం ఎలా ఉంది, మా అధికారులు బాగానే స్పందిస్తున్నారా తదితర వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు భోజనాన్ని స్వయంగా వడ్డించి కలెక్టర్ కూడా వారితో కలిసి భోజనం చేశారు. పెదమైనవానిలంక వద్ద ఒక కిలోమీటర్ పరిధిలో నిర్మిస్తున్న సముద్ర కోత అడ్డుకట్ట నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించారు. సంబంధిత ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడి పనులు ఎప్పటికీ పూర్తవుతాయి, ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం వేములదీవి బాలుర బిసి వెల్ఫేర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు పూర్తిగా తొలగే వరకూ పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని బాధితులకు సూచించారు. తుపాన్ రక్షిత భవనంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ సిబ్బందితో మాట్లాడుతూ పాముకాటు కేసులు ఏమైనా వచ్చాయా, అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాధితులకు సూచించారు. మార్గమధ్యంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కలుసుకుని వారి సేవలను అభినందించారు. కలెక్టర్‌తోపాటు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ ఐతం సత్యనారాయణ, మత్స్య శాఖ ఎడి ఎల్ఎల్ఎన్.రాజు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉప్పుటేరుకు వరద : స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు శివార్లలో ఉన్న ఉప్పుటేరు నీటి ప్రవాహ ఉధృతి క్రమంగా పెరుగుతోంది. చినకాపవరం డ్రెయిన్‌తోసహా సుమారు 25 పంట, మురుగు కాలువలు ఈ ప్రాంతంలో ఉప్పుటేరులో కలుస్తాయి. తాడేపల్లిగూడెం, అత్తిలి దిగువనున్న అన్ని మండలాల్లోని సాధారణ డ్రెయిన్లలో నీరు మొత్తం దీనిలోకే చేరుంది. ఐదు రోజులుగా కురిసిన వర్షాలతో డ్రెయిన్లు నిండు కుండల్లా ప్రవహిస్తూ ఉప్పుటేరులో కలుస్తున్నాయి. ఓపక్క చినకాపవరం కాల్వ, మరోపక్క పాతవయ్యేరు కాల్వ పొంగుతుండటంతో ఉప్పుటేరు నీటిమట్టం పెరుగుతోంది. రెండు రోజుల్లో మూడు అడుగుల మేర నీటిమట్టం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మరో రెండు అడుగులు నీటిమట్టం పెరిగితే ప్రమాద స్థితికి చేరుతుందని తెలిపారు.


ఉప్పుటేరు వద్ద పెరుగుతున్న నీటి మట్టం

ఐదు రోజుల్లో పంటనష్టం నివేదిక సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో నీట మునిగిన పంటల వివరాలను ఐదు రోజుల్లో సేకరించి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల నీట మునిగిన పంటల వివరాలను తెలుసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్ నుండి ఆయన గూగుల్‌మీట్ ద్వారా సమీక్షించారు. పడిపోయిన పంట పొలాలు, నీట మునిగిన వరి చేల నుండి నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం వివరాలు తెలుసుకునేందుకు రైతుసేవా కేంద్రాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలు సేకరించాలన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి రైతునూ ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎడిలు, ఎంఎఒలు పాల్గొన్నారు.

ఆరుగాల కష్టం.. నీళ్ల పాలు..!

ప్రజాశక్తి - ఆచంట

ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటి పాలైందని, తమకు అప్పులు మిగిలాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మొంథా తుపాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీని ప్రభావంతో మండలంలోని వరితోపాటు కూరగాయలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తుండగా, 70 శాతం మేర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, అయోధ్యలంక, పెదమల్లంలంక, ఆనగార్లలంక, కోడేరు, పల్లిపాలెం, పుచ్చల్లంక, మర్రిమూల గ్రామాల్లో ఎక్కువ మంది కూరగాయ పంటలు పండిస్తున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తోటలు చనిపోతున్నాయని సాగుదారులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే సమయానికి వర్షం నిండా ముంచిందని ఆవేదన చెందుతున్నారు. పచ్చిమిర్చి ధర బాగుంటుందనుకున్న తరుణంలో వర్షాల వల్ల నష్టం తప్పలేదని లబోదిబోమంటున్నారు. నాలుగు రోజులపాటు నీటిలో ఉండటంతో చెట్ల ఆకులు రాలి కుళ్లిపోతున్నాయని తెలిపారు. దొండ, బీర, చిక్కుడు పాదుల దుస్థితి అదే విధంగా ఉంది. దొండ పాదులకు పందిర్లు వేయడానికి రూ.లక్ష వరకు ఖర్చు చేశామని, ఈ తరహాలో ఈదురుగాలులకు కొన్నిచోట్ల పందిర్లు కూలిపోయాయని వివరించారు. వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సుమారు 800 ఎకరాల వరకు నేలనంటింది. అధికారులు పంట నష్టాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నేలకొరిగిన అరటి తోట

నల్లిక్రీక్ వంతెన నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - నరసాపురం

మొంథా తుపాన్ వల్ల నల్లిక్రీక్‌పై చినమైనవానిలంక గ్రామంలో పాడైపోయిన వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. నల్లిక్రీక్ ఉప్పొంగి రోడ్డు కోతకు గురై గండిపడిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బలరాం, గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వంతెన నిర్మాణ పనులు మాత్రం జరగడం లేదని విమర్శించారు. ఈ వంతెనకు గండి పడటంతో స్థానిక మత్స్యకారులు వేటకు, ఆక్వా రైతులు తమ చెరువుల వద్దకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. తక్షణం మరమ్మతులు చేపట్టి రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. జీవనోపాధి కోల్పోయిన గ్రామస్తులను, మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. తీర ప్రాంతంలో విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని, గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. నష్టపోయిన ఆక్వా, వరి, కూరగాయ రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలను మరో రెండు రోజులుపాటు కొనసాగించాలని కోరారు. వారి వెంట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, నేత గుత్తుల శ్రీరామచంద్రుడు తదితరులు ఉన్నారు.


నల్లిక్రీక్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నిట్‌లో ఘనంగా టెడ్ ఎక్స్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ రక్షణ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపి నిట్)లో టెడ్ ఎక్స్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచ దేశాలకు ధీటుగా రాణిస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఫ్రీడమ్ విత్ ఎఐ సిఇఒ అవినాష్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతపై పట్టుసాధించిన వారు అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారన్నారు. కోస్ట్‌గార్డ్ వెటరన్ ఆతార్ వామా గౌర్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సరికొత్తగా జీవించాలన్నారు. ఎలికో హెల్త్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వనిత దాట్ల, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్, పిన్ కాల్ డాట్‌కామ్ వ్యవస్థాపకులు డాక్టర్ పట్టాభిరామన్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలో నిలపాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సవాళ్లను అధిగమిస్తూ లక్ష్య సాధనకు ముందుకుసాగాలని సూచించారు. అతిథులను డీన్‌లు, ప్రొఫెసర్లు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ కె.హిమబిందు, ప్రొఫెసర్లు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ కార్తికేయశర్మ, డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి పెంకుటింట్లోనే..!

ఏళ్ల తరబడి అద్దె ఇంటిలోనే హాస్టల్ నిర్వహణ

బెడ్లు లేక బిసి బాలుర హాస్టల్ విద్యార్థుల అవస్థలు

పట్టించుకోని అధికారులు


పోడూరులోని బిసి బాలుర వసతి గృహం

ప్రజాశక్తి - పోడూరు

పోడూరులోని బిసి బాలుర హాస్టల్‌కు సొంత భవనం లేదు. గ్రామంలో అద్దెకి తీసుకున్న ఓ పెంకుటింట్లోనే చాలా కాలంగా ఈ హాస్టల్ నిర్వహిస్తున్నారు. అలాగే హాస్టల్లో విద్యార్థులు పడుకునేందుకు బెడ్లు లేవు. నేలపైనే చాపలు వేసుకుని పడుకోవాల్సిన పరిస్థితి. ఈ హాస్టల్లో మొత్తం 35 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఈ హాస్టల్లో 100 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. అయితే సరైన వసతి భవనం లేకపోవడంతో హాస్టల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. హాస్టల్లో మరుగుదొడ్ల పరిస్థితి బాగానే ఉంది.

గతేడాది నుంచి బిసి గురుకుల పాఠశాల..

పోడూరులో మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల హాస్టల్ గతేడాది నుంచి ప్రారంభమైంది. ఈ హాస్టల్లో దాదాపు 195 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌కు సొంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గతంలో ఇది కళాశాల భవనం కావడంతో వసతులు బాగానే ఉన్నాయి. అలాగే జిన్నూరులోని ఎస్‌సి బాలికల వసతి గృహంలో 15 మంది విద్యార్థులు ఇక్కడ విశాలమైన సొంత భవనం ఉంది. వసతులు సక్రమంగానే ఉన్నాయి.

ప్రజాశక్తి పరిశీలన

కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

మొంథా తుపాన్ వల్ల కురుస్తున్న వర్షాలు, వీచిన గాలులకు వరి చేలు పడిపోయి నీట మునిగి కుళ్లిపోతున్నందున నష్టపోయిన కౌలురైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నౌడూరు, అండలూరు, తమ్మినీడివారిపాలెం, తోలేరు, పెర్కిపాలెం, వీరవాసరం, మత్స్యపురి, బొబ్బనపల్లి గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. మండలంలోని వందలాది ఎకరాలు పడిపోయి నీట మునగడం వల్ల తీవ్రంగా నష్టపోయేది కౌలు రైతులేనన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేలు వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, తుపాన్ వల్ల పంట కుళ్లిపోతుంటే తట్టుకోలేకపోతున్నామని కౌలు రైతులు భోరుమంటున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మురుగు దిగువకు పారని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తీవ్రంగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న కౌలు రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయినపూడి బాబూరావు, కేతా జ్యోతిబసు, తాళ్లూరి రాము, కిలాడి సత్యనారాయణ, పాలా కోటేశ్వరరావు, జుత్తిగ శ్రీనివాస్, మైగాపుల త్రిమూర్తులు, కుడిపూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరి చేలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

తుపాన్ బాధితులకు పక్కా ఇళ్లు కట్టించాలి

పెనుగొండ రూరల్: తుపాన్ బాధితులకు పక్కాఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం సిద్ధాంతం జెడ్‌పి హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో బాధితులను సిపిఎం నేతలు పరామర్శించారు. అక్కడ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు బిస్కెట్ ప్యాకెట్లు, రస్కుల ప్యాకెట్లు, వేరుశనగ ఉండలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ పునరావాస బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతోపాటు రేషన్, రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నక్కవారిపాలెం, చెరువుపేట, బ్యాంక్ కెనాల్ వెంబడి చెట్లు కింద నివాసం ఉంటున్న నిరుపేదలకు పక్కాఇళ్లు నిర్మించి ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.పాదుషా, కప్పల రత్నరాజు, మాకా బాబు, గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి), ఉప సర్పంచి దాసిరెడ్డి రాజు, పంచాయతీ కార్యదర్శి వై.కిషోర్‌బాబు, కడలి సత్యనారాయణ, వెన్నపు వెంకటేశ్వరరావు, తానేటి మదన్, ఎ.బొర్రయ్య, అంజూరి శ్రీను పాల్గొన్నారు.

గణపవరం: పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి ప్రభుత్వం సొంతిళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిప్పర, అర్ధవరం గ్రామంలో ఏర్పాటు చేసిన తుపాను బాధితుల పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఉన్నవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి సొంతిళ్లు లేకపోవడంతో ఈ పరిస్థితులు కలుగుతున్నాయన్నారు. తుపాన్లు, వరదలొచ్చిన ప్రతిసారీ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి అరకొర సదుపాయాలు కల్పించడం తప్ప ఇళ్లు లేని వారందరికీ ప్రభుత్వమే నిర్మించి ఇస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు మేడిశెట్టి పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సిద్ధాంతంలో స్కూల్లో విద్యార్థులకు బిస్కెట్లు అందజేస్తున్న సిపిఎం నేతలు

శర్మకు పలువురి నేతల పరామర్శ

గణపవరం: యుటిఎఫ్ మండల సీనియర్ నాయకులు క్రొవ్విడి శర్మ తండ్రి వీర్రాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను బుధవారం మండల ప్రజా సంఘాల నాయకులు పెచ్చేటి నరశింహమూర్తి, మేడిశెట్టి పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు, కె.త్రినాథ్ శర్మ పరామర్శించారు ఈ సందర్భంగా వారు వీర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వీర్రాజు దస్తావేజురుగా మండల ప్రజలకు పరిచయం ఉన్న వ్యక్తి అని తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

తుపాన్ బాధితులకు ప్రభుత్వం అండ

త్రిమూర్తులు చొరవతో అర్ధరాత్రి విద్యుత్ సమస్య పరిష్కారం

భీమవరం టౌన్: భీమవరం పునరావాస కేంద్రాల్లో రాష్ట్ర కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు మంగళవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. రాత్రి 11 గంటల సమయంలో పట్టణంలోని ఒకటో వార్డు, రెండో వార్డుల్లో, 39వ వార్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అర్ధరాత్రి సైతం త్రిమూర్తులు విద్యుత్ అధికారులతో మాట్లాడి వారిని రప్పించి రాత్రికి రాత్రే దగ్గరుండి పనులు చేయించారు. అలాగే ఆయన పునరావాస కేంద్రంలోని బాధితులతో మాట్లాడి కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయనే స్వయంగా బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. రాత్రి సమయంలో కూడా ప్రజా సమస్యలపై స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించడంపై ఆ ప్రాంతవాసులు త్రిమూర్తులును ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, విన్నకోట వినాయక్ బాబు, 2వ వార్డు టిడిపి అధ్యక్షులు బాతు నరేష్, నేతలు తిరుపతిరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

ప్రజాశక్తి - కాళ్ల: విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని కాళ్ల విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఏలూరుపాడు వెళ్లే 11 కెవి ఫీడర్ విద్యుత్ స్తంభం కూడా విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి నుంచి ఏలూరుపాడులో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉంది. ఎడిఎ, ఎఇ ఆదేశాల మేరకు కాంట్రాక్టు వర్కర్లతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని కాళ్ల, సీసలి, బొండాడ, బోస్ కాలనీ, ఏలూరుపాడు గ్రామాల్లో ఐదు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయని, వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాళ్ల, సీసలి, బొండాడ, బోస్‌కాలనీ, ఏలూరుపాడు, కలవపూడి గ్రామాల్లో తొమ్మిది కరెంట్ స్తంభాలు, 35 చెట్లు నేల కొరిగినట్లు తహశీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు. వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఉండి : తుపాన్ కారణంగా మండల వ్యాప్తంగా సుమారు 25 కరెంటు స్తంభాలు, 20 వృక్షాలు నేలకూలడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కూటమి నాయకులు ప్రజలు, స్వచ్ఛందంగా అధికారులకు సహకరించడంతో బుధవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఎలక్ట్రికల్ సహాయక ఇంజినీర్ శ్రీనివాస్ మాట్లాడారు.

అధికారులకు అభినందనలు : ఎంఎల్ఎలు

తణుకు : మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ నిరంతరం అందుబాటులో ఉండి ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్న అన్ని శాఖల అధికారులకూ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి తుపాను తీరం దాటే వరకు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు ఏర్పాటు చేయడంలో కృషి చేశారని తెలిపారు.

తాడేపల్లిగూడెం : యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తూ తుపాన్ బారిన పడకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని 6వ వార్డుకు చెందిన సుమారు 20 కుటుంబాలకు చెందిన యానదులను తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతి, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అలాగే కృష్ణయ్యపాలెం, అలంపురం, రాయపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇప్పటివరకు 1400 ఎకరాలకు నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, తహశీల్దార్ సునీల్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుపాను నిరాశ్రయులకు యుటిఎఫ్ సాయం

యలమంచిలి : మొంథా తుపాను వల్ల నిరాశ్రయులైన మండలంలోని నార్నిమెరక పంచాయతీ గమళ్లపేట ఎలిమెంటరీ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న 15 మందికి యుటిఎఫ్ మండల శాఖ నిత్యావసర సరుకులు అందించి ధైర్యం చెప్పింది. స్థానిక గమళ్లపేటలో ఇల్లు కూలి నిరాశ్రయుడైన బొడ్డుపల్లి నారాయణరావుకు కూడా నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధ్యాయులు నిరాశ్రయులకు నిత్యావసరాలు అందిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ మండల అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పసల రామ్మూర్తి నాయుడు, గౌరవాధ్యక్షులు కుడుపూడి సత్యనారాయణ, సహాధ్యక్షులు కుసుమ శరత్ బాబు, కార్యదర్శులు దొమ్మేటి చంద్రశేఖరావు తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితి మెరుగుపడేంత వరకూ పునరావాసం

ఆకివీడు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సుమారు 150 మంది చేరారు. చెంచులు, పిట్టల కొట్టే సంచార జీవులు, తదితరులు ఈ శిబిరంలో ఉంటారు. వీరికి దాతల సహకారంతో భోజనాలు అందిస్తున్నారు. టిడిపి పట్టణ నేత గంధం ఉమా సత్యనారాయణ నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు పలువురు శిబిరంలో వారికి సహకరించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఫారూఖ్, ఆర్ఐ ఆంజనేయులు, కమిషనర్ కృష్ణమోహన్ శిబిర నిర్వహణ చేపట్టారు. వరదల పరిస్థితి మెరుగుపడేంత వరకూ పునరావాస కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

కోనుపోతుగుంట డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి

ఆచంట: ఆచంట పంచాయతీ పరిధి కోనుపోతుగుంట గ్రామంలోని డ్రెయిన్‌ను తక్షణం ప్రక్షాళన చేయాలని రైతు సంఘం నాయకులు నెక్కంటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోనుపోతుగుంట పొడవునా పంట, మురుగుబోదే సుమారు కిలోమీటరు పొడవు ఉంటుందన్నారు. నెక్కంటి రామకృష్ణ పొలం నుండి వినాయకుడి గుడి వరకు పంట బోదీగాను, వినాయకుడు గుడి దగ్గర నుండి కనకదుర్గ గుడి వరకు పంట కాలువగా ప్రభుత్వ లెక్కల ప్రకారం మురుగు కాలువగా ఉందన్నారు. ఆ బోదె ద్వారా సుమారు 200 ఎకరాల నుంచి మురుగు వెళ్ళాల్సి ఉందని, అక్కడ ఆ బోదె పూడ్చివేయడమే గాక ప్రతి ఇంటికీ ఒక వంతెన నిర్మించుకున్నారని వాపోయారు. ఏటా ఖరీఫ్‌లో మురుగు బయటకు వెళ్లే మార్గం లేక సుమారు 200 ఎకరాల రైతులు పంట నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఇరిగేషన్, డ్రెయినేజీ సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

తుపాన్ నష్ట గణన ప్రక్రియ చేపట్టాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో మొంథా తుపాను నష్ట గణన ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. తీరప్రాంతంలో కొద్ది రెండు అడుగుల మేర, బియ్యపు తిప్పలో కొద్ది ఒక అడుగు మేర వర్షపు నీరు నిలిచిందని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 93 ఇళ్లు, 174 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఈదురు గాలుల కారణంగా 662 చెట్లు నేల కొరిగాయన్నారు. దెబ్బతిన్న విరిగిపడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు రోజువారీ నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లోని ప్రతి కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.

సంక్రాంతిలోపు రోడ్లకు మరమ్మతులు, నిర్మాణాలు

పాలకోడేరు: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ప్రత్యామ్నాయ స్థలాలు చూపించిన తర్వాతే ఆక్రమణలు తొలగిస్తామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పాలకోడేరు సొసైటీలో తుపాన్ పరిస్థితులు, సహాయక చర్యలపై అధికారులతో బుధవారం సమీక్షించారు. రహదారులు, పంట, మురుగు కాలువల ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే సంక్రాంతి నాటికి రహదారులకు మరమ్మతులు, పక్కన ఉండే ఆక్రమణలు, నిర్మాణాలను తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం గొల్లలకోడేరులోని యనమదుర్రు కాలువను ఆయన పరిశీలించారు. జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు, సొసైటీ ప్రెసిడెంట్ కె.నాగరాజు, టిడిపి నేతలు, పాల్గొన్నారు.

కాళ్లలో మోస్తరు వర్షం

కాళ్ల: ఈదురుగాలులకు చలి తోడు కావడంతో వాతావరణం చల్లబడింది. బుధవారం మండలంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. మొంథా తుపాను ప్రభావంతో పంట, మురుగు కాల్వలు నిండి ఉన్న వరి చేలు నీటిలో నానుతున్నాయి. మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. కలవపూడి హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే లోతట్టు ప్రాంతవాసులెవరూ ఈ కేంద్రానికి రాలేదు. వారంతా వారి బంధువుల ఇళ్లకు వెళ్లారని తహశీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన

ప్రజాశక్తి - వీరవాసరం

తుపాన్ వల్ల నష్టపోయిన వారందరినీ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారిని బుధవారం ఎంఎల్ఎ పరామర్శించారు. అదే విధంగా వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తుపాను బారిన పడకుండా తలదాచుకున్న గర్భిణులను ఎంఎల్ఎ పరామర్శించి వారికి భోజనం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు తమ ప్రాంతంలో సరైన రహదారిలేదని, సీసీ రోడ్డు వేయాలని కోరారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ తుపాను వల్ల పంటలు, రోడ్డు దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. బాధితులకు భోజన సదుపాయం సమకూర్చిన మళ్ల రాంబాబును అభినందించారు. ఆయన వెంట సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవానీ, కోళ్ల నాగేశ్వరరావు, ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మి, మన్నె శ్రీనివాస్, హరిబాబు ఉన్నారు.

నరసాపురం: ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ బుధవారం నరసాపురం మున్సిపల్ పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పర్యటించారు. ఇక్కడి ప్రజలు ప్రధానంగా చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, తుపాన్లు సంభవించినప్పుడు మత్స్యకారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఈ తుపాను ఆక్వా రైతులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. నేరుగా రైతులతో మాట్లాడి, వారికి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆచంట : తుపాన్ ప్రభావం ఉన్నప్పటికీ యంత్రాంగం అండగా ఉంటుందని, పునరావాస శిబిరాల్లోని బాధితులు అధైర్య పడొద్దని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ సూచించారు. బుధవారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామస్థాయి తుపాన్ ప్రత్యేకాధికారులు, సెక్రటరీలు, విఆర్ఒలకు సమీక్షా సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. అనంతరం



వీరవాసరంలో గర్భిణులకు భోజనం అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

భీమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, యంత్రాంగం పునరావాస కేంద్రంలోని బాధితులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు, చొప్పున అలాగే కుటుంబానికి రూ.3000 చొప్పున ప్రభుత్వ పరంగా అందజేసి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట పెనుగొండ సిఐ ఆర్.వివేక్ కుమార్, ఆచంట ఎస్ఐ వెంకట రమణ, ఆచంట డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావు, సర్పంచి మాధవ, ఇఒపిఆర్‌డి బులి సూరన్న పాల్గొన్నారు.

తుపాను కారణంగా ముంపునకు గురైన, పడిపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లోని వరి పంట ముంపునకు గురైందని, మరో 500 ఎకరాల్లోని వరి చేలు పడిపోయాయని ప్రాథమికంగా గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు తెలిపారు.

ఆచంట పోలీస్ స్టేషన్ నుంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లే బైపాస్ రోడ్డు పెద్దపెద్ద గోతులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం రోడ్డు నిర్మించాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు డిమాండ్ చేశారు. బుధవారం రహదారిని పరిశీలించి గోతుల్లోని నీటిని దగ్గరుండి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నిర్మించిన బైపాస్ రోడ్డులో ప్రభుత్వం గోతులు పూడ్చి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైసిపి సీనియర్ నేతలు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఆచంట, వేమవరం, వల్లూరు, కరుగోరుమిల్లి, కొడమంచిలి గ్రామాల్లో నీటి మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు.

పెనుమంట్ర : తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. బుధవారం ఆయన మండలంలోని నత్తా రామేశ్వరం, పెనుమంట్ర, గురువు, మాముడూరు, పాలమూరు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆలమూరు, భట్లమగుటూరు, మార్టేరు, వెలగలేరు ప్రాంతాల్లో పంట నష్టాన్ని ప్రత్యక్షంగా గమనించారు. ఆయన వెంట నేతలు, మండల స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 75 ఎకరాల్లో వరి పైరు నేలకొరిగిందని వ్యవసాయ శాఖ ఎఒ బి.దేవీ స్వరూప అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గణపవరం : మొంథా తుపాన్ వల్ల మండలంలో 1904 ఎకరాల్లో వరి నేలకొరిగినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ చెప్పారు. బుధవారం పంట నష్టం అంచనా వేయడానికి మొయ్యేరు, ముప్పర్తిపాడు, వల్లూరు, వీరేశ్వరపురం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. తెగుళ్లు సోకకుండా ప్రోపకెనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుసుమ కుమారి, సన్ని కాశీప్రసాద్, ఝాన్సీ పాల్గొన్నారు.

కాళ్ల : వరి చేలల్లోని మురుగు నీరు మళ్లించిన తరువాత తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆకివీడు వ్యవసాయ శాఖ ఎడిఎ జీవనప్రతాప్ అన్నారు. మొంథా తుపాన్ ప్రభావానికి ఏలూరుపాడు, దొడ్డనపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి చేలల్లోని దుబ్బులను ఆయన బుధవారం పరిశీలించారు. వరి చేలల్లో మురుగు నీరు మళ్లించిన తర్వాత 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాస్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఆకివీడు : మూడు రోజులుగా తుపాను నేపథ్యంలో ప్రజలు ఇళ్లల్లోనే ఉండడంతో రోడ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వెలవెలబోతున్నాయి. అయితే ప్రభుత్వ సిబ్బంది పునరుద్ధరణ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈదురుగాలులకు మండలంలో మొత్తం సుమారు 30 నుంచి 40 వరకూ విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. వీటిని అత్యవసర ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ అద్దంకి రత్నాకర్ తెలిపారు

ఉండి: చెరుకువాడలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సిపిఎం మండల కార్యదర్శి, మూడో వార్డు సభ్యులు చీరల శేషు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాసితులను పరామర్శించి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో సుమారు 78 మంది నిర్వాసితులకు అధికారులు, గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు సహకారం అందించడం అభినందనీయమన్నారు.

మొగల్తూరు : బాధితులుగా అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలో ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు పునరావాస కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఏ సమస్య ఉన్నా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన మెడికల్ సిబ్బందితో మాట్లాడుతూ పాముకాటు కేసులు ఏమైనా వచ్చాయా, అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను కలుసుకొని వారి సేవలను అభినందించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్లు కె.రాజకుమార్, ఐకె.రాజకుమార్, సత్యనారాయణ, అనిత కుమారి ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో సిపిఎం పర్యటన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెంపలో తుపాన్ షెల్టర్ నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం వెంప గ్రామంలోని కొత్తపేటలో సిపిఎం బృందం పర్యటించింది. బృందం వద్ద తాగునీరు రావడం లేదని, కరెంటు లేదని ఒంటరి వితంతు మహిళలమైన తమకు ఎటువంటి ఆధారమూ లేదని రేకు షెడ్డుల్లో ఉండాలంటే భయంగా ఉందని, తుపాన్ శిబిరం ఏర్పాటు చేయాలని వాపోయారు. ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులుగా కరెంటు, తాగునీటి సదుపాయం లేదన్నారు. వితంతు ఒంటరి మహిళలు ఇళ్లల్లో ఉండాలంటే భయాందోళన గురవుతున్నారని తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉండి: నేలకొరిగిన ప్రతి ఎకరాకూ 20,000 రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని యండగండి, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాల్లో నేలకొరిగిన పంటను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పంటల బీమా పూర్తిస్థాయిలో వర్తింపజేసి రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు దేవరకొండ గిరిధర్, కిలారి తవిటినాయుడు, వీరవల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీవేదకు అరుదైన గౌరవం

నరసాపురం: నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేదకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 31న గుజరాత్‌లోని కేవాడియా వద్ద నిర్వహించే పోలీస్‌లో రాష్ట్ర పోలీస్ బృందానికి డిఎస్‌పి శ్రీవేద నాయకత్వం వహించనున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏకతా దివాస్ పరేడ్ కేంద్రం నిర్వహిస్తోంది. దీనికి అన్ని రాష్ట్రాల నుంచి పోలీస్ బృందాలు శిక్షణకు వెళ్లాయి. రాష్ట్రం నుంచి కూడా పోలీస్‌లు, అధికారులు వెళ్లి శిక్షణ పొందుతున్నారు. డీఎస్పీ శ్రీవేద గత కొద్ది రోజుల నుంచి అక్కడే ఉండి శిక్షణ పొందుతున్నారు. ఆమె ప్రతిభను గుర్తించిన ఉన్నతాధికారులు రాష్ట్ర పోలీస్ పరేడ్‌కు ప్రాతినిత్యం బాధ్యతలను అప్పగించారు. దీంతో పోలీస్ అధికారులు అభినందనలు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

యలమంచిలి : మొంథా తుపాన్ సృష్టించిన బీభత్సానికి మండల వ్యాప్తంగా 100 కరెంట్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మండల వ్యాప్తంగా సుమారు 90 మందితో ఐదు బ్యాచ్‌లుగా విడిపోయి సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనులను యలమంచిలి ఎలక్ట్రికల్ ఎఇ చండీ కిరణ్‌తోపాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన మరో ఇద్దరు ఎఇలు పనులు పూర్తి చేయించారు. ఈ పనులను భీమవరం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఎస్ఇ ఉషారాణి, డిఇ మధు కుమార్, ఎడిఇ రామకృష్ణ పర్యవేక్షించారు. చించినాడతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్తు లైన్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఎలక్ట్రికల్ అధికారులు విద్యుత్తు లైన్ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంపై సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బాధితులకు ఆహారం, నిత్యాసరాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

తుపాను వల్ల ఇబ్బందులు పడుతున్న ఇళ్లులేని పేదలు 550 మందికి బుధవారం గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆహారం, మందులు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా కొనిశెట్టి గణేష్ మాట్లాడుతూ తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణేష్ స్నేహితులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బివి.రాజు మున్సిపల్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన తుపాన్ పునరావాస కేంద్రంలోని వారికి రోటరీ క్లబ్ తరపున బుధవారం ఉదయం టిఫిన్, పాలు, టీ, బిస్కెట్లు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ బాధితులకు రోటరీ క్లబ్ సాయం అభినందనీయమన్నారు. క్లబ్ ప్రెసిడెంట్ గుండు కిషోర్, క్లబ్ డైరెక్టర్ షేక్ బాబాజీ సాహెబ్ మాట్లాడారు. పునరావాస కేంద్రం ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులూ టిఫిన్లు, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్‌విఆర్‌సి జయవర్మ, రోటరీ క్లబ్ సెక్రటరీ విజయభాస్కర్, ప్రసాద్, మడిపల్లి శేఖర్, నడిపెల్లి నరసింహారావు, మున్సిపల్ ఆర్ఐ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గణపవరం : కాశిపాడు తుపాను పునరావాస కేంద్రంలో రెండు రోజులుగా బాధితులకు స్వచ్ఛందగా సేవలందించిన వారికి ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి బుధవారం నగదు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ, సర్పంచి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి హెషువా పాల్గొన్నారు.

మొగల్తూరు : అధిక వర్షాలతో కూలి పనుల్లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పంపన శ్రీకృష్ణ భగవాన్ ఆసరాగా నిలిచారు. మొగల్తూరు పంచాయతీ ఆదర్శనగర్ కాలనీ, పోతులవారిమెరక, పుచ్చకాయలపేట, కుక్కలవారితోట గ్రామాల్లో సుమారు 300 కుటుంబాలకు నాలుగు రోజులు సరిపడా రూ.30 వేలు వెచ్చించి సమకూర్చిన కూరగాయలను పంపిణీ చేశారు.

పెనుమంట్ర : ఎంఎల్ఎ ఆదేశాల మేరకు పెనుమంట్ర గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ముంపునకు గురైన బాధితులకు వసతి కల్పించి, ఆహారం, నీరు పంపిణీ చేశారు. కూటమి నాయకులు గంటా వాసు, గోపరాజు రవి, నరాలశెట్టి వెంకటేష్, శుభాకార్, మణికంఠ, జోగి వెంకటేశ్వర్లరావు సాయం అందజేశారు.

సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నం

పెనుమంట్ర: తుపాన్ తీరం దాటిన అనంతరం సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. మండలంలో 11 గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 104 కుటుంబాలకు గాను 276 మందికి షెల్టర్ కల్పించారు. ఒక ఇల్లు పూర్తిగా, మరో ఇల్లు పాక్షింగా దెబ్బతిన్నట్లు తహశీల్దార్ తెలిపారు. తుపాన్ ప్రభావిత కుటుంబాలకు ఉచితంగా అవసరమైన నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తుపాను కారణంగా ఈదురు గాలులకు భారీ వృక్షాలు నేలకొరడడంతో 22 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, వీటిని యుద్ధ ప్రాతిపదికన 52 మంది సిబ్బందితో పునరుద్ధరించామని, ఓడూరులో ఇండస్ట్రియల్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో కొత్తది ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఎఇ గూడూరి నాగరాజు తెలిపారు. మండలంలో 720 ఎకరాల్లో వరి, కూరగాయలు, అరటి పంటకు ప్రాథమికంగా నష్టం కలిగిందని, ముఖ్యంగా పాలమూరులో పంట నష్టం అధికంగా ఉందని మండల వ్యవసాయ అధికారిని బి.దేవి స్వరూప తెలిపారు.

కోతకు గురైన తీరప్రాంతం

మొగల్తూరు: తుపాను ప్రభావంతో అలల ఉధృతికి తీరప్రాంతం కోతకు గురైంది. తుపాన్ మంగళవారం రాత్రి తీరం దాటింది. దీంతో సుమారు 100 మీటర్ల భూభాగంలోకి సముద్రం చొచ్చుకుకొచ్చింది. దీంతో కోతకు గురైన ప్రాంతం అలలు ఉధృతికి సమాంతరంగా మారింది.

చినమైనవానిలంక వంతెనకు గండి

నరసాపురం: వేములదీవి ఈస్ట్ గ్రామంలోని చినమైన వాని లంక వంతెనకు బుధవారం తెల్లవారు జామున గండిపడింది. సముద్ర కెరటాలు ఎగసి పడడంతో, ఈదురుగాలలు బలంగా వీయడంతో వంతెనకు గండిపడి రోడ్డు రెండు ముక్కలైంది. వందలాది ఎకరాల్లో ఆక్వా చెరువులు నీట మునిగాయి. మత్స్యకారులు సముద్ర వేటకు ఈ వంతెన గుండానే వెళ్తారు. మత్స్య సంపద ప్రస్తుతం ఈ రోడ్డు గుండానే వెళ్తుంది. ఈ బ్రిడ్జి రెండుగా చీలిపోవడంతో వేటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. గండి పట్టడంతో నల్లిక్రీక్‌లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినా గ్రామస్తులు తాడు సహాయంతో ప్రమాదంకరంగా ఉన్న నల్లిక్రీక్ దాడుతున్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక పనులు చేపట్టాలని కోరుతున్నారు.